ప్రజాశక్తి

మంగళవారం 25 నవంబర్ 2025

5

విజయనగరం

అవినీతి ఆరోపణలపై నేడు బహిరంగ విచారణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

భూముల మ్యుటేషన్ చేయడానికి విజయనగరం మండల రెవెన్యూ కార్యాలయంలో లంచం అడుగుతున్నారన్న ఫిర్యాదులపై మంగళవారం బహిరంగ విచారణ చేపట్టనున్నట్టు పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉపకలెక్టర్ మురళి ఒక ప్రకటనలో తెలిపారు. మ్యుటేషన్ చేయడానికి, పట్టాదారు పాసుపుస్తకాల జారీకి అధికారులు రూ.లక్ష వరకు లంచం డిమాండ్ చేస్తున్నారని రాకోడు గ్రామానికి చెందిన రైతులు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, ఈ బహిరంగ విచారణ చేపట్టనున్నట్టు తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ విచారణకు రాకోడు, పరిసర గ్రామాల రైతులు తమవద్దనున్న ఆధారాలతో హాజరు కావాలని ఉప కలెక్టర్ కోరారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద రహదారిపై బైఠాయించిన రైతులు, నాయకులు

ఆందోళనను ఉద్దేశించి మాట్లాడుతున్న పలు పార్టీల నాయకులు

భూములను లాక్కుంటే ఊరుకోం

వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి-గుర్ల

గుర్ల మండలంలో ఏర్పాటు చేయనున్న సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్‌కు 1085 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒఎంఎస్ నెంబర్ 221ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కెల్ల, బెల్లానపేట, దమరసింగి, వల్లాపురం, మన్యపురిపేట, ఎస్ ఎస్ ఆర్ పేట గ్రామాలకు చెందిన రైతులు రోడ్డెక్కారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. కెల్ల జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలి నిర్వహించారు.అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులంతా భూమి మీద ఉంటాం..లేదంటే జైలులో ఉంటామని, స్టీల్‌ప్లాంట్ వద్దు భూములే ముద్దు అని నినదించారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల నుంచి బలవంతంగా భూములను తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రైతులకు తెలియకుండా వారి భూములను ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకొని స్టీల్‌ప్లాంట్ పేరిట బడాబాబులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు భూములను తీసుకోవాలని రాత పూర్వకంగా తహశీల్దార్‌కు తెలియ చేయాలని డిమాండ్ చేశారు. రైతులంతా పాలకొండ రహదారిపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం తహశీల్దార్‌కు వినతి కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణరాజు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు పొట్నూరు సన్యాసినాయుడు, జనసేన నాయకులు విజినిగిరి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు టివి రమణ, అంబళ్ల గౌరినాయుడు, వందలాదిగా రైతులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లోనే పేదలకు పట్టాలివ్వాలి

సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పేదల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పట్టణ పేదలు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టణంలో పేదలు నివాసముంటున్న ప్రాంతాల్లో పట్టాలిచ్చి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ పేదలతో చలో కలెక్టరేట్ నిర్వహించి ధర్నా చేపట్టారు. ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో నివాసం ఉంటున్న పేదలకు వారు నివాసం ఉన్న చోటే ఇళ్లపట్టాలిచ్చి, పేదలకు రెండు సెంట్లు భూమి ఇల్లు నిర్మాణానికి మంజూరు చేయాలని జీవో నెంబర్ 30 రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కానీ నేటికి దీని అమలు చేయలేదన్నారు. తక్షణమే అమలు చేసి కాలనీల ప్రజలకు నివాసం ఉన్నచోటే ఇళ్లపట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టాలని కోరుతున్నామన్నారు. నగరంలోని రామకృష్ణానగర్, ఎల్ఐజినగర్, గురజాడనగర్, వినాయకనగర్, జొన్నగుడ్డి, బుంగవీధి, పూల్‌బాగ్, గంజిపేట, గొడగల వీధి, స్టేడియంపేట, నల్లచెరువు, దాసన్నపేట ఎర్రచెరువులో పేదలు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారన్నారు. వీరికి తక్షణమే పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలని కోరారు. ఇళ్లులేని పేదలకు 2 సెంట్లు భూమి కేటాయించి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామని, అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లు అప్పచెపుతామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు నేటికీ ఆ ప్రక్రియను ప్రారంభించలేదన్నారు. లంకాపట్టణంలో నిర్మించిన హూదూద్ ఇళ్లను తక్షణమే లబ్దిదారులకు అప్పజెప్పాలని కరెంట్, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అయ్యన్నపేట సచివాలయం పరిధిలో ఉన్న గురజాడ నగర్లో కరెంట్, మంచినీటి బోర్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా అధికారులకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, రామచంద్రరావు, జగదాంబ, పట్టణ పేదలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అధికారులకు వినతి అందజేశారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు 'అభ్యుదయం'

విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టీ

ర్యాలీలో పాల్గొన్న డిఐజి, ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించాలనే సంకల్పంతో విశాఖపట్నం రేంజ్ పరిధిలో అభ్యుదయం సైకిలు ర్యాలీ పేరుతో సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరాన్ని పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకు నిర్వహించేందుకు ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని డిఐజి గోపీనాథ్ జట్టీ తెలిపారు.సోమవారం నగరంలో నిర్వహించిన 'అభ్యదయం సైకిలు ర్యాలీలో డిఐజి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – మాదక ద్రవ్యాల పట్ల యువతకు విద్యార్థి దశలోనే సరైన అవగాహన కల్పించాలన్నారు. విశాఖ పట్నం రేంజ్ పరిధిలో ఇప్పటి వరకు 19,740 అవగాహన కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఎస్‌పి ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వినియోగం వలన జీవితం ఏవిధంగా నాశనమవుతుంది, యువత తెలిసీ తెలియని వయసులో డ్రగ్స్ కు బానిసలవుతున్నా రన్నారు. రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో పోలీసులు సైకిళ్ళు మీద ప్రయాణించి, యువతను, ప్రజలను చైతన్యపర్చేందుకు 'అభ్యదయం సైకిలు యాత్ర'ను చేపట్టామన్నారు. సైకిలు ర్యాలీలో విశాఖపట్నం డిఐజి, ఎస్‌పి, జాయింట్ కలెక్టరు నేతు మాధవ్ స్వయంగా సైకిలు త్రొక్కి ర్యాలీలో పాల్గొన్నారు. పోలీసులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఈగల్ టీమ్స్, ఎక్సైజ్ పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువతకు మాదక ద్రవ్యాల అనర్థాల పట్ల అవగాహన కల్పించేందుకు విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్స్, డాన్సు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హెచ్‌ఆర్ పాలసీ, ఎంటిఎస్ అమలుకు

సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హెచ్‌ఆర్ పాలసీ, ఎంటిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగుల సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్–జెఎసి చైర్మన్ బి.కాంతారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేకుండా, తక్కువ జీతాలతో, సరైన హెచ్.ఆర్ విధానం లేకుండా ఉద్యోగులు కష్టాల్లో ఉన్నారని అన్నారు. ఎన్నో ఏళ్లగా పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, ఇపిఎఫ్ గ్రాట్యుటీ–పెన్షన్ ప్రయోజనాలు అమలు, ఆరోగ్య బీమా మరియు మెడికల్ సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ రెగ్యులర్ పోస్టుల నోటిఫికేషన్లలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు తగిన సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందజేశారు. ఈ సమస్యల పరిష్కారానికి డిసెంబరు 10 తేదీన 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరావు, లక్ష్మణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, హైమవతి, లక్ష్మి,రాంబాబు, రవి ఉద్యోగులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి కాపాడాలి

కలెక్టరేట్ వద్ద ఐద్వా ఆధ్వర్యాన మహిళల ధర్నా

ధర్నా చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి అధిక వడ్డీలు, బలవంతపు వసూళ్లు, అప్పుల బాధతో ఇబ్బందులు పడుతున్న మహిళలకు విముక్తి చేయాలని, బ్యాంకుల నుంచి 7 శాతం మించకుండా రుణ సదుపాయం కల్పించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.సత్యవతి డిమాండ్ చేశారు. సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగ సత్యవతి, జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మైక్రో ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారాలు నడుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీల వసూల బారిన పడి అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అప్పుల వలలో చిక్కుకుని ఒక రుణం తీర్చడానికి మరో రుణం తీసుకోవాల్సిన దుస్థితి వెరసి కొన్ని ప్రాంతాల్లో ఆత్మహత్యలు, కుటుంబాల పతనం, ఆర్థిక నష్టం జరుగుతుందన్నారు. వీటిని నియంత్రించడానికి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఐద్వా నాయకులు వి.లక్ష్మి, హరికృష్ణవేణి, జగదాంబ, కుమారి, కె.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చర్యలు చేపడుతున్నామని ఎఐసిసి పరిశీలకులు రాఘవేంద్రదాస్ అన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా విజయనగరం జిల్లా పర్యటనకు అబ్జర్వర్ రాఘ వేంద్ర దాస్, కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీను, జివి త్రినాధ, నవ భరత్, వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాఘవేంద్రదాస్ మాట్లాడుతూ సంస్థ గత నిర్మాణంలో భాగంగా జిల్లాలో పార్టీని ఆ గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నిర్మాణం చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గాల సమన్వయకర్తలు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బి.సి., మైనార్టీ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ తదితర అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 206 వినతులు

సత్వరమే పరిష్కరించాలని జెసి ఆదేశం

వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ సేధుమాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 206 వినతులు అందాయి. ఎప్పటిలాగే అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 94 వినతులు అందగా, డిఆర్‌డిఎకి సంబంధించి 24, సచివాలయ సేవలకు సంబంధించి 14, పంచాయితీలకు సంబంధించి 12, ఇతర శాఖలకు మిగిలిన వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాదవన్, డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాస మూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పిజిఆర్ఎస్‌కు వచ్చే వినతులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్షించారు. గతంతో పోలిస్తే పెండింగ్ వినతులు సంఖ్య బాగా తగ్గిందని అన్నారు. వినతులను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ఇవ్వాలి

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.రాజారావు డిమాండ్ చేశారు. పోలీస్ పరేడ్ మైదానం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. . సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కు అందించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు మండల పరిధిలో పంచాయతీ నుండి ఇంకొక పంచాయతీకి ఫీల్డ్ అసిస్టెంట్‌లను బదిలీ చేయాలని, విద్యార్హత, పని అనుభవం ఆధారంగా పదోన్నతులు కల్పించాలని కోరారు. హెల్త్ కార్డు సౌకర్యం. కల్పించాలన్నారు రాజకీయ వేధింపులు అధికారులు ఒత్తిడి ఆపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గౌరీశంకర్ అధిక సంఖ్యలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి ఉచిత గ్యాస్ సరఫరా చేయాలి

విజయనగరంటౌన్ : మధ్యాహ్న భోజన పథకం కార్మికులు గ్యాస్ తోనే వంట చేయాలనే నిబంధన తప్పనిసరి చేయొద్దని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ లో జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి ఎ జగన్మోహన్రావు మాట్లాడుతూ గ్యాస్ తోనే వంట చేయాలని ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ప్రభుత్వమే ఉచిత గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మధ్యాహ్న భోజన కార్మికులు మంగ, సీత ,రమణమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఖోఖో పోటీలు

సెమీఫైనల్‌లో ఓడిన విజయనగరం

ఫైనల్ కు చేరిన తూర్పుగోదావరి,చిత్తూరు

సెమీ ఫైనల్‌లో తలపడుతున్న జట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక విజ్జీ మైదానంలో జరుగుతున్న అండర్ 17 బాలికల స్కూల్ గేమ్స్‌రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. పాఠశాల స్థాయి విద్యార్థినులు అయినప్పటికీ ఆ జిల్లాను గెలిపించుకునేందుకు క్రీడా స్ఫూర్తి కొనసాగిస్తూ క్రీడాభిమానుల గెలుచుకున్నారు. లీగ్ పోటీలు సోమవారం మధ్యాహ్నంతో ముగిశాయి. అనంతరం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో ప్రారంభమయ్యాయి. క్వార్టర్ ఫైనల్ కు 8 జట్లు చేరుకోగా వాటిలో విజేతలుగా గెలిచి సెమీఫైనల్ కు విజయనగరం, తూర్పుగోదావరి,శ్రీకాకుళం, చిత్తూరు జట్లు చేరాయి. అనంతరం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ విజయనగరం –తూర్పుగోదావరి జట్ల మధ్య ఉత్కంఠ భరితంగా సాగింది. తూర్పుగోదావరి జట్టు చేతిలో విజయనగరం ఓటమి పాలైంది. తూర్పుగోదావరి 10 పాయింట్లు సాధించగా, విజయనగరం 4 పాయింట్లు సాధించి ఓటమి పాలైంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా జట్టు ఫైనల్‌కు చేరుకుంది. రెండో సెమీఫైనల్ మ్యాచ్ శ్రీకాకుళం, చిత్తూరు మధ్య జరగ్గా, చిత్తూరు విజయం సాధించింది. చిత్తూరు 8, శ్రీకాకుళం 6 పాయింట్లు సాధించారు. చిత్తూరు 2 పాయింట్లు తేడాతో విజయం సాధించింది. మంగళవారం ఉదయం జరగనున్న ఫైనల్ మ్యాచ్ లో తూర్పుగోదావరి, చిత్తూరు జట్లు తలపడనున్నాయి.

ఘనంగా ఎమ్మెల్యే అదితి జన్మదిన వేడుకలు

టిడిపి ఆధ్వర్యాన పలు సామాజిక కార్యక్రమాలు

కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పుట్టినరోజు వేడుకలు సోమవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. మాన్సాస్ విద్యాసంస్థల సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలో గల పేర్లవారి వీధిలో గల చెవిటి, మూగ పాఠశాల విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిచారు. డెఫ్ అండ్ డం పాఠశాల విద్యార్థులను దత్తత తీసుకునే నిమిత్తం వారి కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నాయకులు మొత్తం రూ.1,84,000 విరాళాలు ఇచ్చారు. ఈ మొత్తాన్ని పాఠశాల యాజమాన్యానికి ఎమ్మెల్యే అదితి చేతుల మీదుగా అందజేశారు. ప్రేమసమాజంలో వృద్ధులకు 25 స్టూల్స్, ఫైర్ ఆఫీస్ వద్ద గల పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో ఉన్నవారికి 25 దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. విజయనగరం మండలం పినవేమలి గ్రామంలో ఉన్న ఎబిసి వృద్ధాశ్రమంలో పండ్లు, స్వీట్స్ పంపిణీతో పాటు భోజనం ఏర్పాటు చేశారు. విటి అగ్రహారం బాలికల వసతి గృహంలో పార్టీ నాయకుల సహకారంతో రూ.45వేలతో ఏర్పాటు చేసిన ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

బిపిఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కమిషనర్ రాసిన పాటల సీడీ ఆవిష్కరణ

పాటల సీడీని ఆవిష్కరిస్తున్న కమిషనర్ నల్లనయ్య, అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాల్లో, మున్సిపాలిటీల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు, లే అవుట్లు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన ఎల్ ఆర్ ఎస్, బిపిఎస్ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పి.నల్లనయ్య, టౌన్ ప్లానింగ్ డిసిపి కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే ఉద్దేశంతో రాసిన పాటల సీడీని సోమవారం సాయంత్రం నల్లనయ్య ఆవిష్కరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మన నిర్లక్ష్యం వలన రోడ్లను ఆక్రమించడం, భవనాలు నిర్మాణాలు ప్లాన్ ప్రకారం కాకుండా డీవేయేషన్ చేసి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అక్రమ నిర్మాణాలు కూడా రెగ్యులైరేజ్ చేసే విధంగా ఎల్ఆర్ఎస్, బిపిఎస్ ద్వారా రెగ్యులర్ చేసుకునే అవకాశం వచ్చిందన్నారు. దీన్ని మరింత ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ పాటలు రాసినట్లు తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏ సమస్యలనైనా పాట రూపంలో రాయగలిగిన వ్యక్తి కమీషనర్ నల్లనయ్య అని తెలిపారు. చాలా అరుదైన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎసిపి హరిబాబు, టిపిఒ అప్పలరాజు, టౌన్ సర్వేయర్ సింహాచలం, లైసెన్సు సర్వేయర్ లు సంఘం అధ్యక్షులు ఆదినారాయణ, క్రీడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రబోస్, జర్నలిస్ట్‌లు ఎల్.నర్సింగరావు, విజయభాస్కర్, బి.ప్రసాదరావు, ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్స్ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

ఉత్తర్వు కాపీని దగ్ధం చేస్తున్న మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు

ఎపిఎంఎస్ఆర్‌యు ఆధ్వర్యాన

లేబర్ కోడ్‌ల ఉత్తర్వు కాపీలు దహనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ఎపి ఎంఎస్ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద లేబర్ కోడ్ ఉత్తర్వు కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న హక్కులను కార్మిక కోడ్‌ల ద్వారా హరిస్తోందని అన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికులను దోపిడీ, కార్పొరేట్ శక్తులకు బానిసలుగా మార్చే ప్రక్రియకు మోదీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వెంటనే లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, రైతులకు నష్టం చేసే నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు 26న దేశ వ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లాఅధ్యక్షులుభగవాన్, మెడికల్‌రిప్‌లు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు, నల్ల చట్టాల రద్దుకు 26న నిరసనలు

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలో కార్మిక ,రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు, లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 26న అఖిల భారత కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంధ్రనాధ్, కార్యదర్శి పి.రమణ తెలిపారు. సోమవారం ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఉన్న సౌకర్యాలు, పని గంటలు, హక్కులు కోల్పోయే విధానంగా 29కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లను ప్రవేశపెట్టిందన్నారు. వీనివల్ల పని భద్రత, కనీస వేతనాలు అమలు, యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు ఉండేదన్నారు. ఈ నిర్ణయాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26న నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని చెప్పి చేయలేదన్నారు. రాష్ట్రంలో అనేక పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్యాచరణ రూపొందించి ఉద్యమించనున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, బుగత అశోక్, మన్యం జిల్లా కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

కోళ్ల ఫారం తొలగించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని పాత బగ్గాం గ్రామపరిధిలో ఉన్న కోళ్ల ఫారం తొలగించాలని సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో పాత బగ్గాం, బంగారమ్మపేట, భూదేవి పేట గ్రామాల సర్పంచులు, రైతులు జెసి సేదు మాధవన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11ఏళ్లగా కోళ్ల ఫారం ద్వారా వ్యర్థాలు పేరుకుపోయి వర్షాలు కురిసే సమయంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పక్కనే ఉన్న పంట పొలాలకు వర్షపు నీటికి కొట్టుకు వచ్చి సాగు భూములను నాశనం చేస్తున్నారన్నారు. కోళ్ల ఫారానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న మూడు గ్రామాల ప్రజలు దుర్వాసనతో సతమతమవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులకు ఊపిరితిత్తుల సమస్యలు మొదలై అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆరోపించారు. సంబందిత అధికారులకు మండల స్థాయిలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి కోళ్ల ఫారంని తొలగించాలని కోరారు. పాతబగ్గాం మాజీ సర్పంచ్ లెంక చిన్నం నాయుడు, భూదేవి పేట సర్పంచ్ కనకల సుబ్రమణ్యం, బంగారంపేట సర్పంచ్ సత్తిబాబు, నాయకులు కర్రి బంగారునాయుడు, పీరు, సన్యాసిరావు, రైతులు చల్ల రామకృష్ణ, చల్ల వెంకటరమణ, నక్క కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బిసి జనాభా దామాషా పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు, ఎబిసిడిలుగా వర్గీకరించి చట్టబద్ధంగా అమలు జరపాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గదుల వెంకట రావు తెలిపారు. సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఎన్నికల వాగ్దానాలైన 33 శాతం రిజర్వేషన్లు అమలు జరపాలన్నా ముందుగా కులగణన జరపాల్సి ఉందన్నారు. ఆ కుల గణనను కూడా న్యాయస్థానాలు కోరుతున్నట్లు డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్రంగా జరిపించాలన్నారు. జనాభా దామాషా మేరకు పెంచిన బిసి రిజర్వేషన్లను చేర్చి స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి బుజ్జిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు వాళ్లే హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కథల పోటీల్లో జ్యూరీ అవార్డు

నెల్లిమర్ల: జిల్లా రచయితల సంఘం, విశాఖ సంస్కృ మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్గీయ బెహరా వెంకట సుబ్బారావు స్మారక జాతీయ స్థాయి కథల పోటీలలో నెల్లిమర్లకు చెందిన ఉపాధ్యాయుడు యం.రమేష్ కుమార్ రాసిన పరుగు కథకు జ్యూరీ బహుమతి లభించింది. ఆదివారం రాత్రి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ఎస్‌వి‌ఆర్ఎం రాజు, అధ్యక్షులు జివి శ్రీనివాస్, కార్యదర్శి కెకె రఘునందనల చేతుల మీదుగా రమేష్ కుమార్ దంపతులను ఘనంగా సత్కరించి అవార్డును, ప్రశంసా పత్రాన్ని, నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత జయంతి ప్రకాశ శర్మ, విశాఖ సంస్కృతి పత్రిక ఎడిటర్ శిరేల సన్యాశిరావు, పలువురు రచయితలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

బాడంగి: డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు మండల నాయకులు సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంఇఒ కార్యాలయం వద్ద బిల్లులు చెల్లించాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 5వ తేదీ లోపు బిల్లులు, వేతనాలు చెల్లించాలని, వేతనాలు పెంచాలని, గ్యాస్ బండలు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం 10 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని, మెనూ ఛార్జీలను వెంటనే చెల్లించాలని ధరల పెరుగుదలకు అనుగుణంగా స్కూల్ విద్యార్థులకు మెనూ ఛార్జీలు 20 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం కార్మికలు పాల్గొన్నారు.

సాంకేతికతపై శిక్షణ

డెంకాడ: మండలంలోని చింతలవలసలో ఉన్న ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో క్వాంటం మిషన్ లెర్నింగ్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ సిస్టం అనే అంశంపై ఐదు రోజులు పాటు ఆన్‌లైన్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ టి.షణ్ముఖ నాదం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 100 మంది అధ్యాపకులు పరిశోధన పండితులు పరిశ్రమల నిపుణులు ఈ ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైఎంసి శేఖర్, ఈసిఈ హెచ్ఒడి డాక్టర్ రమాదేవి, ఎఫ్‌డిపి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సత్యనారాయణ, డీన్ డాక్టర్ సునీల్ ప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎపిఒపై ఫిర్యాదు

వంగర: ఉపాధి హామీ పథకం ఎపిఒపై స్థానిక ఎంపిడిఒ టి. రాజారావుకు పిఎసిఎస్ అధ్యక్షుడు బెజ్జిపురం రవి సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షుడు పిన్నింటి మోహనరావు, రవి విలేకరులతో మాట్లాడుతూ ఎపిఒ సత్యవతి విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదని అందువల్ల ప్రజలకు ఇబ్బంది జరుగుతుందని అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎపిఒను వివరణ కోరగా మండలంలోని ఎం.సీతారాంపురం కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌కు సంబంధించి ఫైలు పెండింగ్‌లో ఉన్నందున అధికారులు ఆదేశాలు మేరకు పరిశీలన కోసం అక్కడకు వెళ్లానని తెలిపారు.

జిందాల్‌పై సమగ్ర విచారణ చేయాలి

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

శృంగవరపుకోట: జిందాల్ వ్యవహారం పై సమగ్ర విచారణ చేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు డిమాండ్ చేశారు. బొడ్డవరలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిందాల్ నిర్వాసితులు కంపెనీ కోసం భూములు ఇచ్చి మోసపోయి గత 161 రోజులుగా నిరసనలు నిరాహార దీక్షలు చేస్తున్నారన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి, ఎస్‌సిఎస్‌సి, ఎస్‌సిఎస్‌టి, ఇతర ప్రజాప్రతినిధులను కలిసి తమ గోడు వెళ్ళబుచ్చుకున్నారని గుర్తుచ చేశారు. న్యాయస్థానంలో కేసు ఉందని అది వాయిదాల మీద నడుస్తుందని చెప్పారు. రైతులు మాత్రం తాము కేసు గెలుస్తామని తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారన్నారు. సమగ్ర విచారణ జరిపి జిందాల్ బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

బొబ్బిలి: బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు చెప్పారు. మండలంలో బెల్ట్ షాపులు పెట్టి మద్యం అమ్ముతున్న తొమ్మిది మంది వ్యాపారులపై రూ.లక్ష పూచీకత్తుతో ఏడాది పాటు తహశీల్దార్ ఎం.శ్రీను వద్ద బైండోవర్ చేసి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్ట్ షాపుల నివారణకు మద్యం అమ్మితే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

కళాసీ సంఘం నూతన భవనం ప్రారంభం

బొబ్బిలి : పట్టణంలోని యుద్ధ స్తంభం సమీపంలో సోమవారం పట్టణ కళాసీ సంఘం నూతన కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే బేబినాయన ప్రారంభించారు. తాము 1999లో పరోక్షంగా రాజకీయాల్లోకి వచ్చిన సమయంలో కళాసీలు తమకు అండగా ఉన్నారని, కళాసీలకు అండగా ఉంటామని చెప్పారు. కళాసీ సంఘం కార్యాలయ భవనానికి స్థలాన్ని ఇచ్చిన ఎమ్మెల్యే బేబినాయనను కళాసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.అప్పలస్వామి, డి.వర్మ, కళాసీలు సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ శరత్, గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ రౌత రామమూర్తి, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, ఇతర నాయకులు సన్మానించారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం చిల్ల వీధిలో సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మాణ పనులను టిడిపి నాయకులు, సర్పంచ్ గొరివాడ సుందరమ్మ సోమవారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ముంపునకు గురై ముదురుగుంటలో ఇబ్బందులు పడుతున్న చిల్లవీధి వాసులకు ఈ రోడ్డు, కాలువతో మోక్షం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చుక్క ఈశ్వరరావు, గేదెల రామస్వామి, వినోద్, రామచంద్రరావు, సంతోష్, రాము తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై కూటమి నిర్లక్ష్యం

బొబ్బిలి: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహిస్తుందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ హయాంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే కూటమి హయాంలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి పట్టడం లేదని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. ఆయనతో వైసిపి నాయకులు ఉన్నారు.

దత్తిలో వరి ధాన్యం కుప్ప దగ్ధం

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామ సమీప కల్లంలో ఉన్న వరి ధాన్యం కుప్ప, వరి గడ్డి కుప్ప సోమవారం కాలి బూడిదయ్యాయి. రాపాక రాముకు చెందిన ధాన్యం కుప్ప సుమారు 30 బస్తాల ధాన్యం కాలిపోయింది. చోడవరపు బంగారయ్య గడ్డి కుప్ప కాలిపోయిందని గ్రామ రెవెన్యూ అధికారి రామకృష్ణ తెలిపారు. ఈనాటికి రాపాక రాము పండించుకున్న ధాన్యం అగ్నికి ఆహుతైపోవడంతో లబోదిబోమంటున్నాడు. విషయం తెలుసుకున్న గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ఆకట్టుకున్న కోలాటం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాదిలో సోమవారం రాత్రి నిర్వహించిన సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. తుని నుంచి వచ్చిన చిన్నారులు ప్రదర్శించిన కోలాటం పలువురిని కట్టిపడేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట పోటీల్లో తునికి చెందిన చిన్నారుల కోలాట బృందం ప్రథమ స్థానం దక్కించుకుంది. వీరికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, కొత్తవలస మున్సిపల్ కోర్టు సీనియర్ న్యాయవాది గొంప రమణ, సత్యసాయి బాబా ట్రస్ట్ సభ్యులు, గ్రామ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.



షీల్డు అందిస్తున్న గొంప కృష్ణ

గ్రామాల్లో 'రైతన్నా మీ కోసం'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కూటమి ప్రభుత్వంతో రైతులకు మేలు జరుగుతుందని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. సోమవారం ఆయన రామతీర్థంలో రైతన్న మీకోసం వారోత్సవాల్లో పాల్గొని రైతుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వారికి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ ఎఎంసి చైర్‌పర్సన్ ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ రైతు విభాగం అధికార ప్రతినిధి తాడ్డి సత్యనారాయణ, సచివాలయం అగ్రికల్చరల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని ముగడలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆర్‌డిఒ రామ్మోహనరావు పాల్గొని రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. సేంద్రీయ వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. పంచ సూత్రాలను రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ సూర్యప్రకాష్, టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, వైస్ ఎంపిపి ఎస్.భాస్కర్‌రావు, పిసిసి అధ్యక్షులు ఎల్.సత్యం రైతులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు అన్నారు. మండలంలో మెట్టపల్లి గ్రామంలో సోమవారం జరిగిన రైతన్న మీకోసం వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.త్రిమూర్తుల రాజు, దన్నాన రామచంద్రుడు, జనసేన నాయకులు విసినగిరి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏడి కోటేశ్వరరావు, ఎంపిడిఒ ఐ.సురేష్, ఎఒ సూర్య కుమారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రామతీర్థం, సతివాడ, తంగుడుబిల్లి, బొప్పడాం, కొండగుంపాం, కొండవెలగాడ గ్రామాల్లో రైతన్న మీకోసం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామతీర్థంలో జరిగిన కార్యక్రమంలో జెడిఎ విటి. రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం 5 సూత్రాలు ప్రవేశ పెట్టిందని దీనిలో నీటి భద్రత, డిమాండ్ ఆదారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఐదు సూత్రాలు పై అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీకాంత్, ఎఒ పి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రామభద్రపురం: రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ తెలిపారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతులకు సోవమారం ఇంటింటా వ్యవసాయ సంబధిత సూచనలు, సలహాలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవ్వ ఈశ్వరావు, వ్యవసాయ సిబ్బంది వెంకటరమణ, వరలక్ష్మి, జ్యోత్స్న పాల్గొన్నారు. **రేగిడి:** పంటల మార్పిడితో భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చునని తహశీల్దార్ ఐ.కృష్ణలత, ఎఒ శ్రీనివాసరావు అన్నారు.

నెల్లిమర్ల: రైతుకు కరపత్రాన్ని అందిస్తున్న టిడిపి నాయకులు రవిశేఖర్, రాజారావు

సోమవారం పెద్దశిర్లాం, సంకిలి తదితర గ్రామాల్లో రైతన్న మీకోసం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం వరి పంటలు కాకుండా మొక్కజొన్న, పండ్ల తోటలు, కూరగాయల పంటలు వంటివి పండించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ దుర్గారావు, టిడిపి నాయకులు బి.తవిటి నాయుడు, జి.కృష్ణారావు బి. శ్రీరామమూర్తి పలు రైతులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని సింగవరం, డెంకాడ, చొల్లంగిపేట, పినతాడివాడ, పెదతాడివాడ, చింతలవలస, అమకాం, అక్కివరం రైతు సేవా కేంద్రాలలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎఒ టి. సంగీత మాట్లాడుతూ రైతన్న మీ కోసం కార్యక్రమం ఈ నెల 24 నుంచి 29 వరకూ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రాజారావు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త వై.సంధ్యారాణి, పినతాడివాడ గ్రామ మాజీ సర్పంచ్ పల్లె భాస్కర్ రావు, వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి, గ్రామ రెవెన్యూ అధికారి రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి రైతులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో రైతు సమస్యలు తెలియజేయాలని తహశీల్దార్ యం.శ్రీను, ఎఒ యం.శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని పక్కి, చింతాడ గ్రామాల్లో సోమవారం రైతన్న కోసం కార్యక్రమం నిర్వహించారు.

ప్రతి రైతూ సంతోషంగా ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రాష్ట్రంలో ప్రతీ రైతు సంతోషంగా ఉండాలని సిఎం చంద్రబాబు ఆకాంక్షిస్తుంటారని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. సోమవారం పక్కి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గతేడాది కన్నా మద్దతు ధర ఎక్కువ ఇస్తుందని తెలిపారు. సకాలంలో రైతులకు డబ్బును వారి ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ యం.శ్యాం సుందర్, సిఎస్‌డిటి ఆర్.సాయికృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి అప్పలనాయుడు, పక్కి గ్రామ టిడిపి నాయకులు బంకురు బాబూరావు, రెడ్డి బాబూరావు, శివడవలస నాయకులు శంబంగి సీతంనాయుడు, మాజీ సర్పంచ్ చప్ప రామస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

24 గంటల్లోనే రైతు ఖాతాలో డబ్బులు

శృంగవరపుకోట: రైతు నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ట్రక్ సీట్ కొట్టిన 24 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తామని కోపరేటివ్ సొసైటీ పిఎసిఎస్ చైర్మన్ జిఎస్ నాయుడు అన్నారు. మండలంలోని వెంకటరమణ పేట గ్రామంలో ఎఒ రవీంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం చైర్మన్ జిఎస్ నాయుడు, డైరెక్టర్లు గేదెల శ్రీను, వబ్బిన గౌరీ ప్రారంభించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి రవికుమార్ రైతన్న మీకోసం కార్యక్రమం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, రెడ్డి వెంకన్న, జుత్తాడ రామసత్యం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జగదీష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం రైతు సేవా కేంద్రంలో ఎఒ కెవి రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు దగ్గర నుంచి ప్రతి గింజ కొనుగోలు చేస్తామన్నారు. టిడిపి మండల నాయకులు, పిఎసిఎస్ అధ్యక్షులు కోళ్ల శ్రీను మాట్లాడుతూ ప్రస్తుతం క్వింటా సాధారణ రకం ధర రూ.2363 ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి చిరంజీవి, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షపై ప్రభుత్వం కల్పించుకోవాలి

పూసపాటిరేగ: టెట్ పరీక్ష పై రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకోవాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఎపిటిఎఫ్-1938 పూసపాటిరేగ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షులు కె.గోవింద నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 2010 కంటే ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ పరీక్ష పాస్ కావాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వల్ల ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని అన్నారు. ఈ తీర్పుపై పునఃపరిశీలన చేయాలని రివ్యూ పిటిషన్ తమ సంఘం తరపున దాఖలు చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి.పైడిరాజు, మండల ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, జిల్లా కార్యదర్శి పి.దామోదరనాయుడు, కె.అప్పలరాజు, ఏ.వేళంగిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - సంతకవిటి

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాకి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నాలుగు వేల రూపాయలు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. తక్షణమే పెండింగ్ బకాయి జీతాలు చెల్లించాలన్నారు. గ్రామాల్లో ఇంటి ఇంటి చెత్త సేకరణ, పారిశుధ్యం, వాటర్ సప్లై, స్ట్రీట్ లైట్స్ తదితర పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు జీవో నెంబర్ 680 ప్రకారం కనీసం 10వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదాయం లేదని చాలా పంచా యతీల్లో నెలలు తరబడి జీతాలు సర్పంచులు చెల్లించడం లేదని, కొన్ని చోట్ల సర్పంచులు, సెక్రట రీలు ఒకరి మీద ఒకరు చెప్పు కుంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వమే కార్మికుల అకౌం ట్‌లో నేరుగా జీతాలు వెయ్యాలని, హెల్త్ అలవెన్స్ 4వేలు వెంటనే అమలు చేయా లని, రిక్షా బళ్ళు రిపేర్లు చేయాలని, రక్షణ పరికరాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ జనాభా కనుగు ణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒ సురేష్‌కు మార్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.త్రినాథ్, గ్రీన్ అంబాసిడర్స్ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వై.అచ్యుతరావు, ఆదినారాయణ, వాసు, రాములు, తవుడు, శశిభూషణరావు, లక్ష్మణరావు, లీలం నాయుడు, మహేష్, కామయ్య, గారయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

ప్రహరీకి నిధులు మంజూరు చేయండి

జామి : జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం చేయాలంటూ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొత్తలి శ్రీను, విద్యా కమిటీ సభ్యులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. 'ప్రభుత్వ బడులకు ఉరితాడు' అన్న శీర్షికతో ప్రజాశక్తి కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన విద్యా కమిటీ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దాతల ఆర్థిక సాయంతో పాఠశాల అభివృద్ధి పనులు చేస్తున్నారని చెప్పారు. అదికారులు స్పందించి, అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వరలక్ష్మి, కొత్తలి అంజి తదితరులు పాల్గొన్నారు.

జామి శ్మశానం, అగ్రహార భూ సమస్య పరిష్కరించాలి

నేసనల్ హైవే నిర్మాణంతో మాయమైన జామి శ్మశాన వాటిక స్థలాన్ని పునరుద్ధరించి, దాన్ని అభివృద్ధి చేయాలని, తాతల తండ్రుల నుంచి ఉన్న అగ్రహార భూ సమస్య పరిష్కరించాలని జామి ఎంపిటిసి- 2 వరలక్ష్మి కలెక్టర్ గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు. వేలాది మంది ప్రజలు, రైతాంగం సమస్యను పరిష్కరించేందుకు ఉన్నాతధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ సోషల్ టీచర్‌గా అప్పలనాయుడు

ప్రజాశక్తి - సంతకవిటి

ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో పోర్ట్ సిటీ స్కూల్‌లో జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల అవార్డుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు చేతుల మీదుగా సంతకవిటి మండలం మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గడే అప్పలనాయుడుకు జిల్లా ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ అవార్డుని అందుకున్నారు. రాష్ట్ర, జిల్లా రిసోర్స్ పర్సన్‌గా ఎన్నో సంవత్సరాలు సేవలు అందించిన ఆయన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. సోమవారం పక్కి పిహెచ్‌సిలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మందుల స్టాక్ వివరాలను, అత్యవసర సమయాల్లో కావలసిన మందుల అందుబాటు గురించి అడిగి తెలుసుకున్నారు. తన తండ్రి జ్ఞాపకార్థం త్వరలో నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకూ కొన్ని అత్యవసర మందులను ఉచితంగా పంపిణీచేస్తామని తెలిపారు. జిల్లా అధికారుల పరిధిలో ఉన్న సమస్యలను అక్కడ నుంచే వారితో మాట్లాడి, వీలైనంత త్వరగా పరిష్కారం చేయాలని కోరారు. మరికొన్ని సమస్యలను గురించి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు బంకురు లక్ష్మి అనారోగ్యానికి గురైన విషయాన్ని తెలుసుకుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

విజయనగరం టౌన్: ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి పుర సేవలను మరింత విస్తృత పరచనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 5 ఫిర్యాదులు అందాయి. కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం ఎస్ఎఫ్ఐ మండల మహాసభ నిర్వహించారు. విద్యా రంగంలో బొబ్బిలి అభివృద్ధి చెందుతున్నా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రైవేట్ కళాశాలలో ఫీజులు కట్టి చదవలేక పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ హాస్టల్స్‌లో పలురకాల సమస్యలు ఉంటున్నాయని చెప్పారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న బొబ్బిలిలో విద్యా రంగ సమస్యల పరిష్కారానికై, విద్యారంగ పరిరక్షణ లక్ష్యంగా నిరంతరం అధ్యాయనం, పోరాటం అనే నినాదాలతో, విద్యార్థుల కోసం కృషి చేస్తున్న ఎస్ఎఫ్ఐ మండల మహాసభలలో నూతనంగా ఎన్నుకోబడ్డ మండల కమిటీ అలుపెరగని పోరాటాలు చేయాలన్నారు.

భవిష్యత్తులో ఈ సమస్యల పరిష్కారానికై పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ మండల మహాసభలలో 12 మందితో నూతనంగా కమిటీ ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా తేజ, కార్యదర్శిగా కిరణ్, ఉపాధ్యక్షులుగా మహేష్, సహాయ కార్యదర్శి జానీ, గజేంద్రలను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకీ, జిల్లా సహాయ కార్యదర్శి మణికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టెన్నీకాయిట్‌కు ఎంపిక

ప్రజాశక్తి - చీపురుపల్లి

వచ్చేనెల 22 నుంచి 26 వరకు జరిగే జాతీయ స్థాయి టెన్నికాయట్ పోటీలకు పెదనడిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు ఎంపికైనట్లు పాఠశాల పీడీ ఎం.రామా రావు తెలిపారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా సొండిపుడి హై స్కూల్లో నిర్వహించిన 37వ రాష్ట్ర స్థాయి టెన్నికాయట్ ఛాంపియన్షిప్ పోటీలలో జిల్లా తరపున పాల్గొన్న కె.ఇందు, కె.కావ్య, అదనపు క్రీడాకారిణిగా ఎం.భారతి సత్తా చాటారన్నారు. వీరు వచ్చే డిసెంబర్‌లో 22 నుంచి 26 వరకు కేరళ రాష్ట్రంలో నిర్వహించే 37వ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, అభినందించారు.

రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాడ్మింటన్ పోటీలకు లక్కవరపు కోట మండలం లోని చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రొంగలి జశ్వంత్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ నెల 25వ తేది నుంచి 27వ తేదీ వరకు కృష్ణాజిల్లా గన్నవరంలో జరగబోవు రాష్ట్ర స్థాయి అండర్14 బాల బాలికల బాడ్మింటన్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీరాములు తెలిపారు. ఎంపికైన క్రీడా కారులను ఉపాధ్యాయులు అభినందించారు.

29న వికలాంగులకు క్రీడా పోటీలు

విజయనగరం టౌన్ : వచ్చేనెల 3న జరిగే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సంధర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 21ఏళ్లలోపు వికలాంగులకు ఈనెల 29న బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామనిజిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు ఆసక్తి గల చెవిటి, మూగ బాల బాలికలు ఈనెల 29న రాజీవ్ స్టేడియంలో జరుగు బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు హాజు కావాలని తెలిపారు. పేర్లు నమోదుకు 9133773485 బ్యాడ్మింటన్ శిక్షకుల ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీలకు పయనం

విజయనగరం టౌన్: విజయనగరం ఎస్‌జిఎఫ్ అండర్ 14 జిల్లా బాడ్మింటన్ టీమ్ రాష్ట్ర స్థాయి పోటీలకు సోమవారం బయలు దేరిందని చందులూరు జెడ్‌పి హైస్కూలు పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ పోటీలు ఈనెల 25 నుండి 27 వరకు కృష్ణాజిల్లా గన్నవరంలో జరుగుతాయని తెలిపారు. ఈ బ్యాడ్మింటన్ టీమ్ జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో బయలు దేరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కస్పా వ్యాయామ ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి, బ్యాడ్మింటన్ కోచ్ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో కలశ ప్రతిష్ట

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. ఇటీవల ఈ ఆలయాన్ని సందర్శనకు వచ్చిన రావులపాలెం గ్రామానికి చెందిన ఆడారి వెంకటప్పారావు, జగ్గారావు సోదరులు, గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది కోరిక మేరకు రూ.2 లక్షలతో ఆలయంలో కలశ ప్రతిష్ట గావించారు. ఈ సందర్భంగా మర్రిపాలెం గ్రామానికి చెందిన బొడ్డేపాటి బ్రదర్స్ వారి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం మూడు కేజీలతో తయారు చేసిన గుడి గంటని సోమవారం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపిటిసి సత్యనారాయణ, గ్రామ పెద్దలు ఉగ్గిని శ్రీను, జె.సత్తిబాబు, మల్ల రమణ, సోంపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరు రోజులు గ్రామ సభలు

వేపాడ: గ్రామాల్లో ఆరు రోజులు పాటు రైతన్న మీకోసం గ్రామసభలు నిర్వహిస్తామని ఎఒ ఎం.స్వాతికుమారి తెలిపారు. గ్రామ సభలలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ ఎనర్జీ అసిస్టెంట్, గ్రామ రెవెన్యూ అధికారి బృందంగా ఏర్పడి, రైతులను సర్వే చేయాలన్నారు. ప్రతి రైతుని మొబైల్ యాప్ ద్వారా సర్వే చేయాలన్నారు. అనంతరం ఆతవ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభను మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ సోమవారం పరిశీలించారు. ఎఇఒ అక్కునాయుడు, విఎఎ, రైతులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా విఆర్‌ఎల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకర్రావు, సంఘం నాయకులు లక్ష్మణరావు, అప్పారావు, గణపతి అన్నారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆర్‌డిఒ రామ్మోహన్‌రావు విఆర్‌ఎలు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రులు, ముఖ్యమంత్రులు మారుతున్నారు కానీ విఆర్‌ఎల కష్టాలు సమస్యలు తీర్చేవారు కనిపించడం లేదని అన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

చీపురుపల్లి: ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మారడం లేదంటూ విఆర్‌ఎల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్‌డిఒ జి.సత్యవాణికి అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు గడుస్తున్నప్పటికీ తమ డిమాండ్లు ఏవీ పరిష్కారం కాలేదని చెప్పారు. ప్రత్యేకించి విఆర్‌ఎలకు పదోన్నతులు కల్పించడంతోపాటు ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఎల్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘ ప్రతినిధులు, పలువురు విఆర్‌ఎలు పాల్గొన్నారు.

కంటోన్మెంట్: గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు చేశారు. అనంతరం వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా విఆర్‌ఎల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం కాలేదన్నారు. ఏడేళ్లగా ఒక్క రూపాయి కూడా జీతం పెరగలేదన్నారు. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో విఆర్‌ఎలకు పేస్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుందని, మన రాష్ట్రంలో కూడా పెరిగిన ధరలకు అనుగుణంగా పే స్కేల్ అమలు చేయాలని కోరారు. అర్హులైన వారికి అటెండర్, నైట్ వాచ్మెన్లు గా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలను కూడా వర్తింపజేయాలన్నారు. ధర్నాలో విఆర్‌ఎలు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ : కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

డిటి జగన్నాధ రావు మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండల ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వివిఆర్ జగన్నాధరావు(52) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రెండు రోజుల క్రితం కార్యాలయానికి విధులకు హాజరై తీవ్ర తలనొప్పితో బాధపడుతూ కుర్చీలోనే కుప్పకూలిపోయారు. వెంటనే తహశీల్దారు కె.శ్రీకాంత్ వెంటనే స్పందించి సిబ్బంది సహకారంతో కారులోనే సమీపంలో ఉన్న మిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక వైద్యం అందించి మెదడులో నరాలు చీలినట్లు గుర్తించి మెరుగైన వైద్యం కోసం కుటుంబీకుల సహకారంతో విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జగన్నాధరావు సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు.